కిడ్నీ ఆస్పత్రిలో ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

పలాస : పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ విధానంలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభిస్తోందని అదనపు డైరెక్టర్ అలు పద్మజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6తో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు మొత్తం 264 దరఖాస్తులు అందాయని అన్నారు. ఈ దరఖాస్తుల్లో జనరల్ డ్యూటీ అటెండెంట్స్ పోస్టులకు 81 మంది, సి-ఆర్మ్ టెక్నీషియన్ పోస్టులకు 16, డయాలసిస్ టెక్నీషియన్ పోస్టులకు 26, రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్ ఉద్యోగానికి 96, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగానికి 45 మంది దరఖాస్తు వచ్చినట్టు వివరించారు. ఆదివారం ఉదయం 10.,30 నుంచి సాయంత్రం 5:00 గంటల మధ్య ఆస్పత్రిలో డైరెక్టర్ కార్యాలయంలో తమ దరఖాస్తులను స్వయంగా సమర్పించాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అసంపూర్తి ప్రాజెక్టులతో అభివృద్ధి ఎలా సాధ్యం?

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్
- 25న కలెక్టరేట్ వద్ద ధర్నా
- ప్రాజెక్టుల పరిశీలన, గ్రామసభకు తీర్మానం

సంఘీభావం తెలియజేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వంశధార ప్రాజెక్టు పూర్తి చేయకుండా జిల్లా అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగరంలోని సుందరయ్య భవనంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వామపక్ష, ప్రజా సంఘాలు సంయుక్తంగా సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు పూర్తి చేసి శివారు భూముల వరకు రెండు పంటలకు సాగునీరు అందించాలన్నారు. అందులో భాగంగా వంశధార ఆధునికీరణకు రూ.1500 కోట్లు కేటాయించాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. కేంద్ర రాష్ట్రాల్లో బిజెపి, టిడిపి కూటమి అధికారంలో ఉందని, వంశధార వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిషన్ మనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అన్నారు. దానిని కేంద్రం గజిట్ నోటిఫికేషన్ ఇచ్చి నేరడి వద్ద బ్యారేజ్ ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ ప్రాజెక్టుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నేరడి బ్యారేజీ నిర్మించకపోతే రిజర్వాయరుకు నీరు రాక పెద్ద చెరువుగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయరు ద్వారా చివర భూముల వరకు రెండు పంటలకు నీరు ఇస్తే జిల్లాకు రూ.2000 కోట్ల ఆదాయం వస్తుందని అన్నారు. తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరిగి అనుబంధ పరిశ్రమలు వస్తాయని తెలిపారు. గోదావరి, కృష్ణా జిల్లాలతో సమానంగా మన జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. వంశధార రిజర్వాయరు పూర్తి చేయకుండా అభివృద్ధి కోసం చెప్పడం అంటే అది బూటకమే అని అన్నారు. నదీ జలాలను సక్రమంగా వినియోగిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వంశధార నదిలో సుమారు లక్ష క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని, దానిలో మన వాటా 50 శాతం వంశధార ఎడమ కాలు ద్వారా 2400 క్యూసిక్కులు, కుడి కాలు ద్వారా 800 క్యూసెక్కులు నీరు మాత్రమే ఉపయోగిస్తున్నామని తెలిపారు. మిగిలిన నీరు వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 6400 చెరువులకు వంశధార నీటిని అనుసంధానం చేస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. మరోవైపు వంశధార బ్యారేజ్ నిర్మించి 50 ఏళ్లు కావస్తోందని, పూర్తిగా శిథిలా వ్యవస్థకు చేరుకోకముందే మేల్కోవాలని సూచించారు. బ్యారేజీ ఆధునికీరణకు రూ.1500 కోట్లు అవసరం కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కేటాయించలేదని విమర్శించారు. పురాతన ప్రాజెక్టులు పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సింపు' నుంచి ఎందుకు నిధులు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ నేటికీ పూర్తి కాకపోవడంతో పలాస వాసులకు తాగునీరు, మూడు మండలాల్లో సాగు నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగవళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టు ఆధునీకరణ, కాలువలు పునరుద్ధరణకు కేటాయించిన నిధులు రూ.12 కోట్లు బకాయి ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయని అన్నారు. గతేడాది ఇచ్ఛాపురం ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చినప్పుడు బహుద నదిలో గ్రోయన్ల నిర్మాణానికి రూ.21 కోట్లు ఇస్తున్నట్లుగా ప్రకటించారని గుర్తు చేశారు. ఆ హామీ ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. మేజర్ అండ్ మైనర్ ఇరిగేషన్‌కు మెయింటినెన్స్‌కూ డబ్బులు కేటాయించకుండా నీరు చివరకు ఎలా వెళ్తుందని ప్రశ్నించారు. జిల్లాపై పాలకుల నిర్లక్ష్యమే వెనుకబాటుకు కారణమని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు ఎందుకు నిధులు కేటాయించడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏప్రిల్ 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టులు పరిశీలన, గ్రామ సభలు నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పొందూరు చంద్రరావు, సిఐటియు నాయకులు అల్లు సత్యం, నారాయణపురం కాలువ పోరాట కమిటీ నాయకులు అల్లు సూర్యనారాయణ, పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్.గోవర్ధనరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, శ్రీను జనవిజ్ఞాన వేదిక నాయకులు కొత్తకోట అప్పారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు, బి.హరీష్, రైతు సంఘం నాయకులు బాగతి వాసుదేవరావు, రామారావు పాల్గొన్నారు.

కొబ్బరి తోటలు

కొబ్బరి బీమా... రైతుకు లేదు ధీమా

ప్రజాశక్తి - కవిటి

ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతున్న ఉద్దానం కొబ్బరి రైతులకు బీమా ఆదుకుంటుందనే ధీమా కొరవడుతోంది. కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే కొబ్బరి బీమా చేయించుకుంటే మిగతా రైతులకు లక్ష్యం పేరుతో మొండిచేయి చూపిస్తున్నారు. దీంతో కొబ్బరి బీమా చేసుకోవాలనుకునే రైతులు బీమా అమలు విధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకుంటుందనే ఆలోచనతో 2025 జనవరిలో కొబ్బరి బీమా పథకంపై ఉద్యానవన శాఖ అధికారులు ప్రకటన చేశారు. స్థానిక సచివాలయ సిబ్బంది, కొబ్బరి రైతు సంస్థల ద్వారా క్షేత్రస్థాయిలోకి విషయాన్ని చేరవేశారు. కానీ, ఫిబ్రవరి నెలాఖరు వచ్చేసరికే కొబ్బరి బీమా లక్ష్యం పూర్తయినట్టు అధికారులు చెప్పారు. దీంతో మిగతా రైతులు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జిల్లావ్యాప్తంగా 20 వేల కొబ్బరి చెట్లకు మాత్రమే బీమా సదుపాయం చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అందులో భాగంగా కవిటి మండలంలోని 8 వేల చెట్లకు రైతులు ఇన్సూరెన్స్ చేసుకున్నారు. ఇక్కడే వచ్చింది చిక్కు. ఈ 8 వేల చెట్లకు ఇన్సూరెన్స్ చేసిన రైతులు మూడేళ్ల కాల పరిమితికి బీమా చేశారు. కానీ, అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మాత్రం ఏడాదికి మాత్రమే అవకాశం కల్పించింది. దీంతో ఈ ఎనిమిది వేల చెట్లు మూడేళ్ల ప్రాప్తికి లెక్కవేసి లక్ష్యం పూర్తయినట్టు బీమా అధికారులు తేల్చేశారు. దీంతో సమయం మించిపోయిన తర్వాత డిడి తీసిన రైతులు నిరాశ చెందారు.

అధికారులకు తెలియజేశాం

కొబ్బరి బీమా విషయంలో స్థానిక సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా చాలామంది రైతులు మార్చి నెలాఖరులోగా బీమా చేద్దాంలే అనే ధీమాలో ఉండిపోవడం, బీమా చేసిన రైతులు మూడేళ్ల కాలపరిమితికి బీమా చేయడం కొంత సమస్యగా మారింది. ప్రస్తుతం లక్ష్యం పూర్తవడంతో కొబ్బరి బీమా చేయడం లేదు. అయితే మరి కొద్ది రోజుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ పథకంలో భాగంగా కొబ్బరి బీమా అవకాశం కల్పిస్తామని అధికారులు తెలియజేశారు. దానికోసమే ఎదురు చూస్తున్నాం. వచ్చిన వెంటనే మళ్లీ కొబ్బరి బీమా పథకం ప్రకటన జారీ చేస్తాం.

- పోలాకి మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి

తూతూమంత్రంగా...

కొబ్బరి బీమా అనేది తూతూ మంత్రంగా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా కేవలం 20 వేల కొబ్బరి చెట్లకు మాత్రమే బీమా సదుపాయం కల్పించడంతోనే ఈ విషయం తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత పెంచాల్సిన అవసరం ఉంది. స్థానిక పరిస్థితులు, తరచూ వస్తున్న ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకొని ప్రతీ కొబ్బరి చెట్టుకు బీమా సదుపాయం కల్పించాలి. **- ఎ.అనిల్ కుమార్, కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు**

డిడి తీసినా ఫలితం లేదు

కొబ్బరి బీమా కోసం 240 చెట్లకు డిడి తీశాను. అయితే అప్పటికే తమ లక్ష్యం పూర్తయిందని, ఇక అవకాశం లేదని అధికారులు తెలిపారు. అలాగే మరికొంతమంది రైతులు కూడా డీడీలు తీశారు. ఇలా అరకొరగా కాకుండా ప్రతి కొబ్బరి చెట్టుకూ ఇన్సూరెన్స్ అవకాశం కల్పిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

- గొండ్యాల రవికుమార్, కొబ్బరి రైతు, గొండ్యాల పుట్టుగ

విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ఉపకరణాలను అందజేస్తున్న మంత్రులు

శ్రీకాకుళం అర్బన్ : విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లలను తప్పక చదివించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. జిల్లా కేంద్రంలో భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం ప్రాంగణంలో శనివారం పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగుల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు అనేక రకాలైన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిన్నతనంలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కలలు కంటుంటారన్నారు. అయితే పిల్లలను క్రమశిక్షణతో చదివించి సన్మార్గంలో నడిపించడానికి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వికలాంగులకు పింఛనుతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని అన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వికలాంగుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తోందన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ సభాస్థలిగా ఉన్న భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి మెరుగైన సౌకర్యాలతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, డిఇఒ తిరుమలచైతన్య, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి సంపతిరావు శశిభూషణరావు, వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యతో బలమైన పునాది

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

ప్రతి విద్యార్థికీ ప్రాథమిక విద్య పునాది లాంటిదని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని రామయ్యపుట్టుగలో కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లతో 117 జిఒ రద్దు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 117 ఉపసంహరణతో క్షేత్రస్థాయిలో కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసేలా సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం వల్ల కలిగే లాభాలు ప్రజలకు వివరిస్తూ వారిలో అపోహలు తొలగేలా చైతన్యం కలిగిస్తూ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూ ఫౌండేషన్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు ప్రజలకు సవివరంగా తెలియజేయాలని సూచించారు. ప్రాథమిక విద్యా విధానంలో ఉన్న లోపాలు సరిచేస్తూ విద్యార్థి ఉన్నతిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పటిష్ట విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాటాడుతున్న విప్ అశోక్

ఉత్సవాలకు నువ్వలరేవు సిద్ధం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సామూహిక వివాహాలతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన నువ్వలరేవు ఆదివారం నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు సిద్ధం చేశారు. గ్రామంలో, ఆలయం వద్ద విద్యుత్ అలంకరణలతో సుందరీకరించారు. 13 రోజులు పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నామని సర్పంచ్ మువ్వల పూర్ణచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు బైనపల్లి నవీన్ తెలిపారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో, ఆచారాలకు పెద్ద పీటవేసి సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను చూసేందుకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి యాత్రికులు వేల సంఖ్యలో తరలివస్తారు. ఇప్పటికే గ్రామానికి చెందిన వలస కార్మికులు అందరూ వచ్చారు. ఉత్సవాలు సందర్భంగా యువకులు డాన్సులు, పగటి వేషాలు, కర్ర సాము, కోయి డాన్సు, నాటకాలలు అలరించనున్నాయి. రావణ దహనంతో ఉత్సవాలు ముగుస్తాయి. సర్పంచ్ మాట్లాడుతూ తరతరాలుగా ఐకమత్యాన్ని నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

నువ్వలరేవు ముఖద్వారం

పిడుగులపై అప్రమత్తం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉన్నట్టు ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. వివిధ మండలాల అధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. దీంతో పాటు ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. అందువల్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు తక్షణమే రద్దు చేస్తూ, వారు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు కలెక్టరేట్‌లో 08942 20557 నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు. అవసరమైతే ప్రజలు నేరుగా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చన్నారు. ప్రధానంగా సోంపేట మండలంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రంలోకి వేటకు వెళ్ల వద్దని మత్స్యకారులకు సూచించారు. పిడుగుల సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

15 నుంచి మోడల్ ఇఎపి సెట్

విజయవంతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోస్టరును విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ఈ నెల 15 నుంచి 17 వరకు మోడల్ ఇఎపి సెట్ పరీక్షను శివాని కళాశాలలో నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు తెలిపారు. ఈ మేరకు నగరంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అంటే విద్యారంగంలో ఉండే సమస్యల కోసం పోరాడడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన బాధ్యతలను గుర్తు చేస్తుందన్నారు. అందులో భాగంగా పరీక్షలు అంటే విద్యార్థుల్లో ఉండే భయాన్ని పోగొట్టేందుకు ముందస్తుగా మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో పది పరీక్షల ముందు మోడల్‌గా ప్రజ్ఞ వికాస్ పరీక్ష నిర్వహించి విద్యార్థులు పది పరీక్షల్లో మంచి ఫలితాలు అందుకునేందుకు తోడ్పాటు అందించామన్నారు. ఎంసెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని ఎంసెట్‌కు హాజరవుతున్న విద్యార్థులంతా వినియోగించుకుని భవిష్యత్‌లో జరిగే పరీక్షకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాయకులు రాహుల్, గోవర్ధన్, శిరీష పాల్గొన్నారు.

అక్కడ అమరావతి... ఇక్కడ టెక్కలి

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న సమభావం, నిస్వార్థం టిడిపి కూటమి నేతల్లో కొరవడినట్లుగా కనిపిస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై, తమ వారికి మేలు కలిగించేలా ఒకే ప్రాంతం అభివృద్ధిపై ధ్యాస పెడితే మిగిలిన ప్రాంతాల ప్రగతి కుంటుపడుతుంది. రాష్ట్రానికి నాయకత్వం వహించే నేతలు అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తే సమతుల్య ప్రగతి సాధ్యపడుతుంది. అదేవిధంగా జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న నేతలు అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తే అన్ని రంగాల్లో మంచి ఫలితాలు వస్తాయి. ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతం అభివృద్ధికి కట్టుబట్టు ఉన్నామని మాటల్లో చెప్పు పెట్టుబడులు మాత్రం తమ ప్రాంతానికో, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికో తీసుకువెళ్లిపోతే మిగిలిన ప్రాంత ప్రజలకు అన్యాయం చేసినవారవుతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టంతా అమరావతి అభివృద్ధిపైనే ఉంటే... వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి ధ్యాస అంతా తన నియోజకవర్గమే బాగుపడాలనే కాంక్షతో ముందుకు వెళ్తున్న పరిస్థితులు మనం చూస్తున్నాం. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడాన్ని ఎవరూ అభ్యంతరం చెప్పరు. అదే సమయంలో జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న ఆయన మిగిలిన ప్రాంత ప్రజల సమస్యలు, వారి ఇబ్బందులను కాస్తా చూస్తుండాలి. ఇటీవల కాలంలో టెక్కలి నియోజకవర్గంపై భారీగా నిధులు కుమ్మరిస్తున్న పరిస్థితిని చూస్తున్నాం. రెండు రోజుల కిందట కోట్లాది రూపాయాలతో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మూడు మండలాల పరిధిలో సుమారు రూ.4 కోట్ల అంచనాతో రహదారులు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. గత నెల 22న నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ తాగునీరందించేందుకు రూ.97 కోట్ల లభ్యత ఉందని, టెండర్లను పిలిచి పనులు ప్రారంభించాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులు ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్ర నుంచి నౌపడ వరకు రెండు లైన్ల రహదారి నిర్మిస్తామని సైతం ప్రకటించారు. చివరకు నిరుద్యోగ యువతకు జిల్లాస్థాయిలో నిర్వహించాల్సిన జాబ్‌మేళాను సైతం కోటబొమ్మాళిలోనే నిర్వహించి అనేక విమర్శలను మూటగట్టుకున్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన్న కోటబొమ్మాళిలో ఈ నెల 1న నిర్వహించిన జాబ్‌మేళాకు 32 సంస్థలను తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు లేక కనీసం ప్రయివేట్ కంపెనీల్లోనైనా చేరేందుకు జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. అది కోటబొమ్మాళికే పరిమితం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంత నిరుద్యోగ యువత పాల్గొనేందుకు అవకాశం లేకుండాపోయింది. ప్రభుత్వం నుంచి నిధులు రప్పించుకుని మంత్రి అచ్చెన్నాయుడు తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటుంటే కొంత మంది ఎమ్మెల్యేలు ప్రజలకు నష్టం కలిగించే ప్రాజెక్టులనే అభివృద్ధిగా వర్ణించుకుంటున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు వస్తుందని, దాంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిపోతుందని, యువతకు ఉపాధి దొరకుతుందంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. థర్మల్ ప్రాజెక్టుతో రైతులు భూములు కోల్పోవడంతో పాటు వేలాది కుటుంబాలు నిరాశ్రయులవుతారని వేరే చెప్పనక్కర్లేదు. థర్మల్ ప్రాజెక్టు వెదజల్లే కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుందో అనకాపల్లి జిల్లా పరవాడ థర్మల్ ప్రాజెక్టు ఉన్న గ్రామాల పరిస్థితిని తెలుసుకుంటే అవగతమవుతుంది. కాలుష్యం కాటుతో అనారోగ్యం బారిన పడుతున్న కుటుంబాలు తమ గ్రామాలను తరలించాలని మొరపెట్టుకుంటున్న పరిస్థితి అక్కడ ఉంది.

పలాస ఎమ్మెల్యే నియోజకవర్గానికి పెద్దగా నిధులు తీసుకురాలేకపోగా ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని కార్గో ఎయిర్‌పోర్టు అభివృద్ధికి అవసరమని యథాలాపంగానే అభివృద్ధి రాగం వినిపిస్తున్నారు.

సిక్కోలు పర్యటనకు వచ్చే ప్రతిసారీ వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేస్తామంటూ మాటల్లో ప్రేమ కురిపించే ముఖ్యమంత్రి చంద్రబాబు చేతల్లో మాత్రం అమరావతిపై ప్రేమ కురిపిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా, దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లా వాసులే నిర్మాణ పనుల్లో ఉంటున్నారని, ఇక్కడి నుంచి వలసలు వెళ్లకుండా ఇతర ప్రాంతాల వారే జిల్లా వైపు చూసేలా పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానంటూ అనేక సందర్భాల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పటిమాదిరిగానే అమరావతి జపమే చేస్తున్నారు. పరిశ్రమలు, ప్రాజెక్టులను రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్న పరిస్థితిని చూస్తున్నాం. వెనుకబడిన జిల్లాగా శ్రీకాకుళంలో కనీసం ఒక్క పరిశ్రమనైనా ఏర్పాటు చేసేందుకు బాబుకు మనస్కరించడం లేదు. రాబోవు రోజుల్లో జిల్లా నుంచి అమరావతికి వలస వెళ్లే పరిస్థితిని కల్పిస్తున్నారు. జిల్లాలోని పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించడం లేదు. 2014-19 టిడిపి హయంలో మొదలైన వంశధార ఫేజ్-2 స్టేజ్-2, ఆఫ్‌షోర్ పనులు నేటికీ పూర్తి కాలేదు. వంశధార ఆధునికీకరణ జోలికి వెళ్లడం లేదు. నిధులు కేటాయింపులు అవససరం లేని షట్టర్ల సమస్య పరిష్కారానికి దిక్కులేకుండా పోయింది. వెనుకబడిన జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను విస్మరించి నిరంతరం పోలవరం పాటపాడుతున్నారు. ఇప్పటికయినా మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాన్ని ఒప్పించి సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు రప్పిస్తే మాటల్లో చెప్పే సస్యశ్యామలం కార్యరూపం దాల్చుతుంది. జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కల్పించినవారవుతారు. అలా కాకుండా రాజకీయ కోణంలో ఒక ప్రాంత అభివృద్ధికే ప్రాధాన్యమిస్తే ఇతర ప్రాంత ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది. అది టిడిపికి, కూటమి ప్రభుత్వానికి నష్టం కలిగించకమానదు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోటబొమ్మాళి వారి కోర్టులో OS.41/2023.

Between:- వైశ్యరాజు భీమరాజు .....వాది
And:- వైశ్యరాజు భాగ్యలక్ష్మి మరియు ఇతరులు .....ప్రతివాదులు

To,
D-6: వైశ్యరాజు దమయంతి, W/o లేటే రామరాజు, R/o జలేశ్వర ఆలయం దగ్గర, నక్క వీధి, శ్రీకాకుళం టౌన్, పోస్టు మరియు జిల్లా,
D-10: శ్రీమతి గుడ్ల నవ్య, W/o మధు, D/o లేటు రామరాజు, R/o మెయిన్ రోడ్డు, సీతంపేట, గ్రామం మరియు పోస్టు మరియు మండలం పార్వతీపురం మన్యం జిల్లా.

నోటీసు

పై నెంబరు దావాలోని, వాది దావా ప్లెయింట్ పరిహారం కోరుచూ, వాది దావాను దాఖలు చేసినందున, పైదావాలో మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై మీరు మీయొక్క ఆక్షేపణలు ఉన్న ఎడల, పై కోర్టు వారి ఎదుట తెలుపుటకు మీరు గాని, మీరు నియమించుకొన్న ప్లీడరు గారు గానీ వాయిదా **తేది 15-4-2025- ఉదయం గం॥ 10.30 ని॥లకు** విన్నవించు కోవలయును. లేని ఎడల పరోక్షమునందున తీర్పు చెప్పబడును కావున ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియ జేయడమయినది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

పూజారి వాసుదేవరావు
వాది తరపున న్యాయవాది,
శ్రీకాకుళం.

శ్రీకాకుళం
తేది:04-04-2025

మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిప్రత్యూష

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ఆర్‌డిఒ సాయిప్రత్యూష

ప్రజాశక్తి- ఆమదాలవలస

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం, రైతులకు ప్రయోజనం కలగనుందని ఆర్‌డిఒ సాయి ప్రత్యూష అన్నారు. శనివారం మండలంలోని కట్యాచార్యులపేటలో జరిగిన రీ సర్వే ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన రీ సర్వే గ్రామసభలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రీ సర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న అర్జీలను గ్రామసభల్లో అందించాలని కోరారు. రైతుల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు సకాలంలో పరిష్కరిస్తారన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని, గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంబాబు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవి, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

వక్ఫ్ బిల్లుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లుపై డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ గాంధీ విగ్రహం వద్ద కేంద్రంలోని బిజెపికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లు భారతదేశంలో ఉన్న యావత్ ముస్లిం సమాజానికి వ్యతిరేకమని, ఈ బిల్లులో ఇతర మతస్తుల సభ్యులుగా ఉంటారని తెలియజేయడం శోచనీయమన్నారు. బిజెపి ప్రభుత్వం దేశంలో మత స్వేచ్ఛ హరిస్తూ కులాల మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతుందని, ఇది ఏమాత్రం లౌకిక వాద సమాజానికి మంచిది కాదన్నారు. ఈ బిల్లు వల్ల ముస్లిం ఆస్తులు ప్రభుత్వ పరం అవుతాయని, దీనివల్ల ముస్లిం మైనార్టీలకు అభివృద్ధికి ఆటంకమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు, డిసిసి ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, సాయి, దుల్లా ఖాన్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు అంబటి దాలి నాయుడు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు చాన్ భాష, ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి ఆబోతుల వెంకట నాయుడు, ఇజ్జురోతు రమణ, ఆముదాలవలస ఇన్‌ఛార్జి బొచ్చ వెంకట రమణ, నరసన్నపేట ఇన్‌ఛార్జి మామిడి సత్యనారాయణ, కొత్తపల్లి రాంప్రసాద్, భాషా బాబు, సూరియా బేగం, చోడవరం లీలావతి, చోడవరం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి

గుజరాతీపేట : జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రులు

ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న వైస్ ఛాన్సలర్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న పద్మావతి

రణస్థలం : నివాళ్లర్పిస్తున్న సాయికుమార్ తదితరులు

ప్రజాశక్తి- గుజరాతీపేట

ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఉప ప్రధాని, సమతావాది డా. బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలు అరసవిల్లి మిల్లు జంక్షన్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అరసవల్లి మిల్లు జంక్షన్ కూడలిలో కాంస్య విగ్రహన్ని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళంలో అభివృద్ధి జగ్జీవన్‌రామ్ జయంతి రోజు నుంచి మరింత వేగవంతం అవుతాయన్నారు. దేశానికి ఉప ప్రధానిగా అయన చేసిన సేవలు, అప్పటి చట్టాలు, వివక్ష లేని సమసమాజం ఏర్పాటు చేసిన మహనీయులు బాబుజగ్జీవన్ రామ్ అన్నారు. వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం ఆవిష్కరించడం సంతోషం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ డివివి ఎస్ ప్రసాదరావు, తహశీల్దార్ గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ పైడి శెట్టి జయంతి, అరవల రవేంద్ర, దళిత నాయుకులు తైక్వాండో శ్రీను, కల్లేపల్లి రాంగోపాల్, కంట వేణు, ఎస్.వి.రమణ మాదిగ, బోసు మన్మధరావు, బోనాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్‌పి అడ్మిన్ కె.వి రమణ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: డా.బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో నేటి తరం ముందడుగు వేయలని, కెఆర్‌సి ఉప కలెక్టర్ పద్మావతి, ఉప కలెక్టర్ అప్పారావు అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కలెక్టరెట్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ సూర్య ప్రకాష్, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, డి సెక్షన్ సూపరింటెండెంట్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో

జిల్లా టిడిపి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా టిడిపి ఉపాధ్యక్షులు పిఎంజె బాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమణ మాదిగ, కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ ఆధ్వర్యాన

నగరంలోని పాత శ్రీకాకుళంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యాన జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గంజి ఎజ్రాతో పాటు టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాడ విజయ్ కుమార్, చిన్నారావు, కె.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో లంక ప్రభ, సర్పంచ్‌లు ఆకుల రవికుమార్, బాలి శ్రీను, ఎస్.నాగేశ్వరరావు, వెలిచేటి సురేష్, రామకృష్ణ, మన్నె లక్ష్మి ప్రసాద్, గురాల రఘనాథ్, జి.త్రినాథ్, దన్నాన చిరంజీవి, దన్నాన వంశీ, కరాటే లక్ష్మణ్, టి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అరసవిల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఉప గ్రంథాలయాధికారి వి.వి.జి.ఎస్.శంకరరావు, కె.ప్రత్యూష, వై.అమర్నాథ్, పి.రామ్మోహన్, ఎ.దిలీప్, సిహెచ్ గణేష్ పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మాజీ ఎంపిటిసి లోపింటి నారాయణరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో క్రైస్తవ మైనార్టీ టిడిపి క్రిస్టియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాడ విజయ్ కుమార్, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు తేజశ్వరరావు, ఎంఇఒ-2 టింగరాజు రామారావు, చిన్నారావు, గురుమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, వర్శిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపిడిఒ తిరుపతిరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ సంత మైదానం ఆవరణలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కారి శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, కార్యదర్శి అబ్దుల్ ఖాన్, మనోజ్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండల సమాఖ్య కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎపిఎం ప్రసాదరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ మీన, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ తహశీల్దార్ బడే పాపారావు చిత్రపటానికి పూలమాలలు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, రంజిత్ పాల్గొన్నారు.

నరసన్నపేట : వైసిపి కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నియోజకవర్గ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్, నియోజవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ముచ్చ గణేష్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక కోర్టు కూడలి వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తొగిరి లక్ష్మీనారాయణ, నవగాన రత్నకుమార్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి శిర్ల జోగారావు, సలహాదారులు శిర్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీష్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస 27 వార్డు పరిధిలో ఉల్లాసపేటలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయం నుంచి నీలమణిదర్గ ఆలయం వరకు రూ.16 లక్షల వ్యయం నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థావన చేశారు. అదే వార్డు పరిధిలో రామలక్ష్మణ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన పవర్ బోరును ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు. ఇంకా అవసరమైతే ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, లొడగల కామేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ గురిటి సూర్య నారాయణ, అంబటి కృష్ణమూర్తి, డిఇ కనకరాజు పాల్గొన్నారు

జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

జలజీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఇషాన్ బాషాకు ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. శ్రీకాకుళంలోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధికారులను కలిశారు. పలాస నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో కేవలం 19 పంచాయితీల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయని, ఆ సమయంలో పనులు సక్రమంగా సాగలేదని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తోందని, మిగిలిన గ్రామాల్లోనూ పనులు పూర్తి చేసి తాగునీటిని అందించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పైపులైన్ పనులను వేగవంతం చేసి వేసవి ఎద్దడిని అధిగమించేందుకు తాగునీటిని అందించాలని కోరారు. అలాగే డిఇ సూర్యనారాయణ, జలజీవన్ ప్రాజెక్టు మిషన్ డిఇ ఆశాలతను కలిసి సమస్యను వివరించారు.

లారీ-బస్సు ఢీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భీమవరం నుంచి చేపల లోడుతో ఒడిశా వైపు వెళ్తున్న లారీ, ఓ ప్రయివేటు బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమా దంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులో ఉన్న పదే ఏళ్ల విద్యార్థి తరుష్, కృష్ణారావులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వా స్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న సంజీవరావు

విద్యార్థులకు అవగాహన

కొత్తూరు : స్థానిక వెలుగు అసోసియేషన్‌లో పనిచేస్తున్న గ్రామాల్లోని పదో తరగతి, ఇంటర్ చదువుకున్న విద్యార్థులకు బాల కార్మికులు, బాల్యవివాహాలు, విద్యా హక్కు చట్టం, ఉచిత నిర్బంధ విద్య, ఆరోగ్యం, పోషకాహారాలకు సంబంధించిన వెలుగు సిఇఒ బి.సంజీవరావు శనివారం అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఏ దిశగా చదువులు కొనసాగించాలి? ఏ కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయనేది తెలియజేందుకు ఛార్ట్ తయారీ చేయారు చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది బి.వెన్నెల, బి.వసంత, ఎస్.ఆనందరావు, ఎస్.టి. మిన్నారావు, ఎస్.టి. శంకరరావు, కె.దాసు నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌ఎబిహెచ్ ప్రమాణాలతో వైద్య సేవలు

బగ్గు సరోజనీదేవి ఆస్పత్రికి ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బొందిలీపురంలో ఉన్న బగ్గు సరోజినీ దేవి ఆస్పత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పెటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఎబిహెచ్) గుర్తింపు లభించింది. దేశంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ)లో నమోదైన స్వయం ప్రతిపత్తి సంస్థ ఎన్‌ఎబిహెచ్ ప్రజల ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాల నాణ్యత, అక్రిడిటేషన్ కోసం ప్రమాణాలను నిర్దేశిస్తుందని, అటువంటి సంస్థ నుంచి గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందని బిఎస్‌డి ఆస్పత్రి ఎండి డా. బగ్గు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ఆస్పత్రి పని చేస్తుందని, అత్యున్నత ప్రమాణాలు పాటించిన ఆస్పత్రిగా గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. 357కుపైగా అంశాలను పరిశీలించి వాటి నాణ్యతను గుర్తించిన అనంతరం ఈ గుర్తింపును ప్రకటించారన్నారు. తమ ఆస్పత్రిలో తొమ్మిది సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో పాటు, 12 డయాగ్నోస్టిక్స్ సేవలకు ఈ గుర్తింపు లభించిందని, జిల్లా చరిత్రలో తొలిసారిగా ఈ గుర్తింపు పొందిన ఏకైక ఆస్పత్రిగా అవతరించామన్నారు. గుర్తింపు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగింద న్నారు. పేద, మధ్యతరగతి రోగులు ఆస్పత్రికి వస్తుంటారని, వారికి నాణ్యత గల వైద్యం అందించేందుకు వీలవుతుందన్నారు. జనరల్ సర్జరీ, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, ఎనస్థీషియా, జనరల్ మెడసిన్, గైనకాలజీ అండ్ ఒబిజి, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్స్, ఇఎన్‌టి విభాగాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని వివరించారు. అలాగే డయాగ్నోస్టిక్స్ విభా గంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే, ఇసిజి, ఇఇజి అండ్ ఇఎన్‌ఎంజి, ఇకో, క్లినికల్ బయో కెమిస్ట్రీ, క్లినికల్ పాథా లజీ, హెమటాలజీ, ఫిజియోథెరపీ, రీ హేబిలిటేషన్ విభాగా లకు ఈ గుర్తింపు లభించినట్టు వివరించారు. వాస్తవానికి 2017లోనే ఎన్‌ఎబిహెచ్ ఎంట్రీలెవల్‌కు అర్హత సాధించినప్పటికి పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు గుర్తింపు పొందలేక పోయామన్నారు. ఇప్పుడు ఆకల నెరవేరిందని వివరించారు. ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలను తీసుకురావడంలో సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుమార్తెలు పుట్టారని వదిలేసిన భర్త

ఇంటి ముందు భార్య ధర్నా

భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న పిల్లలతో భార్య

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఆడపిల్లలను కనటమే ఆతల్లి శాపమైంది. దీంతో రెండేళ్ల పాటు అత్తవారు ఇంటికి దూరమైంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి మండుటెండలో అత్తవారి ఇంటిముందు ఐదు గంటలపాటు పిల్లలతో నిలుచున్నా కనికరించని అత్తామామ, భర్త. వివరాల్లోకి వెళ్తే... మండలం సరియాబొడ్డపాడు పంచాయతీ బడ్డిపేటకు చెందిన ఉపాధ్యాయుడు మెట్ట గోపాలకృష్ణతో టెక్కలి మండలం పోలవరానికి చెందిన చింతాడ వెంకటరమణ, భానుమతిల కుమార్తె రాణితో 2017 మే నెలలో వివాహమైంది. అయితే గత రెండేళ్లుగా అత్తవారు అంగీకరించకపోవడంతో కన్నవారు ఇంటికే పరిమితమైంది. వీరికి వేద్విక, స్వాతిక ఇరువురు అడపిల్లలు కావటం వల్లనే అత్తమామలైన విశ్రాంతి ఉపాధ్యాయులు మెట్ట అప్పలనాయుడు, ఢిల్లేశ్వరిలు కోడలను తన ఇంటికి తీసుకురావడానికి అంగీకరించటం లేదు. రాణి భర్త గోపాలకృష్ణ మెళియాపుట్టి మండలం మురికింటిభద్రలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. తాను పనిచేస్తున్న గ్రామం నుంచి ఆయన స్నేహితులు సమస్యను ఎన్ని రోజులు ఇలా కూర్చోని మాట్లాడుకోవాలని చెబుతునా... వినకపోవడం చోచనీయం. కాగా, ఏడాది నుంచి ఫోన్‌లో మాట్లాడేందుకు భార్య రాణి ప్రయత్నించినా భార్య నంబరును బ్లాక్‌లో పెట్టాడు. కాగా, శనివారం పోలవరం నుంచి వచ్చిన పెద్దమనుషులు, గ్రామంలోని పెద్దమనుషులు తలుపులు తీయమని పదేపదే విన్నవించినా తీయలేదు. ఆడ పిల్ల తరుపు పెద్దమనుషులు పోలీసులకు పిర్యాదు చేయనున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న కచేరి

ఆకట్టుకున్న గాత్ర కచేరి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రగడపుట్టుగలోని కోదండ రామాలయంలో 54వ సుప్రభాత వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దానం కళాకారులతో ఏర్పాటు చేసిన గాత్రకచేరి ఆహుతులను అలరించింది. పండి హరిశంకర్, దూట్ల వెంకటేశం గాత్రానికి ఎన్ని దేవరాజు వయోలిన్, బెందాళం రామారావు హార్మోనియం, గొణప లక్ష్మణమూర్తి మదంగం తోడవడంతో కచేరి కనులవిందుగా సాగింది.

ఐకేర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మెరుగైన వైద్య సేవలు అవసరం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో గతంలో వైద్యం కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసల కోర్చి ఆర్థిక భారంతో ఇబ్బందులు పడేవారని, అందుకు భిన్నంగా నేడు అత్యాధుక సాంకేతికతతో వైద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో కలిసి శనివారం నగరంలోని బలగ ప్రాంతంలో అత్యాధునిక సాంకేతికతో నెలకొల్పిన మంచు ఐకేర్ కంటి ఆస్పత్రిని ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యులు డా. మంచు వాసుదేవరావు, డా. పి శ్రీకాంతి, ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఎక్కువ శాతం మంది సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారే ఉన్నారని, అందువల్ల వ్యాపార లాభాపేక్ష కాకుండా మంచి మనసుతో వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

భవితవ్యాన్ని నిర్దేశించేది ఇంటర్

టెక్కలి: విద్యార్థుల భవితవ్యాన్ని నిర్దేశించేది ఇంటర్మీడియట్ అని పేడాడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో రానున్న విద్యా సంవత్సరం నుంచి అమలవుతున్న సంస్కరణలపై స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాల ఆవరణలో తల్లిదండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్, మెడికల్ వంటి ఉన్నత విద్య, స్టాఫ్ సెలక్షన్, ఎన్‌డిఎ వంటి చదువులకూ ఇంటర్మీడియట్ దోహదపడుతుందన్నారు. సమావేశంలో పి.బిదేవి బిఇడి కళాశాల ప్రణవి, అధ్యాపకులు వానపల్లి భాగస్వామి, కొండల రుక్మాంగధరావు, నత్తు కృష్ణారావు, జి.కుమారి, డొక్కరి ప్రభాకరరావు, ఎన్.రాజారాం, కో-ఆర్డినేటర్ అప్పన్న పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పోలాకి: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. శాంతి భద్ర తల పరిరక్షణకు, నేర నియంత్రణ, సంఘ విద్రోహచర్యలు అరికట్టే దిశగా పోలీసుశాఖ కఠినమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. పోలీసులు రాత్రి సమయంలో గస్తీ, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి రాత్రి 11 గంటల తరువాత ఎటువంటి కారణం లేకుండా రోడ్లపై తిరిగితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

పరిశీలిస్తున్న ఇంజినీర్లు

ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సర్వే

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు కొత్తగా మంజూరైన ఆర్‌ఒబి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నాయక్, ఆర్‌బి చీఫ్ ఇంజినీర్ సుకన్యలు శనివారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొత్త ఆర్ఒలకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. పిఆర్ స్పెషల్ ఎఇ బి.ధనంజయ, శ్రీనివాస్ రౌలో పాల్గొన్నారు.

బియ్యం బస్తాల వితరణ

రణస్థలం: మండలంలోని కోటపాలేంలో శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేయనున్న భారీ అన్నదాన కార్యక్రమానికి జనసేన నాయకులు గొర్లె సూర్య శనివారం బియ్యం బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గౌరి, చేతన్, అప్పన్న, వినాయక, టిడిపి నాయ కులు ఆసిరి నాయుడు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాలు అందజేస్తున్న సూర్య

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

సర్పంచ్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి

ప్రజాశక్తి- పలాస

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన అప్పటి సర్పంచ్ బైనపల్లి రఘు మృతి అంశంలో ఆయన కుటుంబీకులను పలు అనుమానాలున్నాయని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు అన్నారు. ఈ అంశంపై కేసును పునర్విచారణ చేపట్టాలని కోరుతూ శనివారం కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మృతుడు రఘు కుటుంబీకులు ఎమ్మెల్యే శిరీషని కలుసుకుని తమ గోడును వెలిబుచ్చినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో రఘు మరణం వెనుక తమకు ఎన్నో అనుమానాలున్నాయని, మళ్లీ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. 2024 ఏప్రిల్ 4న తమ గ్రామ సమస్యపై అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజుతో చర్చించేందుకు ఆయన కార్యాలయానికి వెళ్లి మాట్లాడారని, ఈ క్రమంలో ఇరువురి మధ్య అభిప్రాయబేధాలు వచ్చి అప్పటి మంత్రితో రఘు విబేదించారని సిఐకు వివరించారు. అనంతర పరిణామాల నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రఘు శవమై కనిపించాడని అన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్

డాన్స్ చేస్తున్న విద్యార్థులు

పలాస : చదువుతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జె.ఎస్.వి.కీర్తి అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ కోర్సులను చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను పొందవచ్చు అని తెలిపారు. చక్కటి ప్రణాళికతో తమ జీవితాలను స్వర్ణమయం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను చదివి బ్యాంకు, ఆర్‌ఆర్‌బి, ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి వంటి సంస్థల్లో ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, డాక్టర్ పి.మధు, ఐఒఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఎన్ఎఎంసి కో-ఆర్డినేటర్ శ్రీనివాస పట్నాయక్, లైబ్రేరియన్ బి.నరసింహులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న అనంతరావు

బీమా చెక్కులు అందజేత

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం ఆర్.హెచ్.పురం పంచాయతీలో విద్యుదాఘాతంతో పోలాకి నందేసు మృతి చెందారు. మృతుడి భార్య రమణమ్మకు రూ.పది లక్షలు ప్రమాద బీమా నిధులు విడుదల అయ్యాయి. అలాగే ఇటీవల అనారోగ్యం సమస్యతో చిగురువలస ఆదినారాయణ మృతి చెందారు. మృతుడి అరుణకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్స్యూరెన్స్ కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. లో ఎపి వికాస బ్యాంక్ రీజినల్ మేనేజర్ అనంతరావు చెక్కులను శనివారం అందజేశారు. కార్యక్రమం సర్పంచ్ ఎన్ని మన్మథరావు, ఎఫ్ఐసి నోడల్ అధికారి, బోరుభద్ర బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తరంగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు, ఏరియా మేనేజర్ బాలరాజు, రాము, టిడిపి నాయకులు ఎన్ని గౌరినాయుడు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం

దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురానికి చెందిన పొట్నూరు మోహనరావు ఇంటి పెరడలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది. శనివారం సాయంత్రం ఈదురుగాలులు, చెదురు మొదురు వర్షాలకు కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు అంటుకున్నాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ యునివర్సిటీలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ త్రినేత్రి మాట్లాడుతూ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అత్యవసరం అనుకుంటే శక్తి యాప్‌ను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ బాలాజీ, ఎఒ ముని రామకృష్ణ, ఎస్ఐ రవికుమార్, డీన్ శివరామ కృష్ణ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ త్రినేత్రి

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారునికి పని కల్పించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 6 నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం పూట పని చేయాలన్నారు పని ప్రదేశాల్లో మంచినీరు సౌకర్యం కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేటలో వర్షం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం మిగిల్చింది. ఇప్పటివరకు ఎండలు భగభగ మండడంతో ఉక్క పాత, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గెడ్డల్లో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కొద్దిపాటి వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది.

పాలకొండ : పాలకొండలో శనివారం సాయంత్రం స్వల్ప వర్షం కురిసింది కొద్దిరోజులుగా ఎండలు వేడికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటం ఇచ్చింది. ఒకసారి చల్లదనం రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మరి కాస్త వర్షం ఎక్కువ పడి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కిమ్మిలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రూ.49.12 లక్షలతో అభివృద్ధి పనులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని తెలగ, మఠ్రి, మందిరం, దళిత, రెల్లి, పెరుగు తదితర వీధుల్లో రూ 49.12 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు శనివారం తెలిపారు. కాలువలు, సిసి రహదారులు, శ్మశాన వాటికలు, కల్వర్టులు తదితర 28 రకాలైన పనులు గుర్తించామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

శరవేగంగా పారిశుధ్య పనులు

కురుపాం: స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో శనివారం ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఇఒ వై.వెంకట నాయుడు పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలు వీధుల్లో గల కాలువల్లో చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో మురుగు వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా గౌడువీధి, శోభలతదేవి కాలనీ, ప్రధాన రహదారి వద్ద గల ఇరువైపులా కాలువల్లో నిండి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజలకు మురుగు వాసన నుంచి విముక్తి కలిగించామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి ధన్యవాదాలు తెలిపారు.

కాలువల్లో పూడికలు తీయిస్తున్న పంచాయతీ ఉపసర్పంచ్, ఇఒ

ఆపరేషన్ కగార్‌ని నిరసించాలి

టెక్కలి : అడవులను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఏర్పాటు చేసిన ఆపరేషన్ కగార్‌ని నిరసించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమక్రసీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం టెక్కలి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల నుంచి అడవులను విముక్తి చేసే పేరిట మోడీ సర్కార్ తలపెట్టిన ఈ కగార్ ఆపరేషన్ వల్ల వెనుక రహస్య అజెండా ఉందన్నారు. రూ.లక్షల కోట్ల విలువజేసే ఖనిజ సంపదని కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కేంద్రం పేదల పక్షాన పాలన సాగించడం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. బిజెపి విధానాలను ఎండగట్టేందుకు ఐక్యత అవసరమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, గొరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్

నిధుల విడుదలపై హర్షం

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిధులు విడుదల చేశారని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఈ మేరకు కొత్తూరులో శనివారం విలేకరులతో మాట్లాడుతూ హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది అక్టోబరు నెలలో ఎమ్మెల్యే పరిశీలించారని అన్నారు. అలాగే నవగాం గ్రామంలో పాలకొండ-హద్దుబంగి ప్రధాని రహదారిపై ఇరువైపులా కాలువలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఎమ్మెల్యే మంత్రులతో మాట్లాడి ఉపాధి హామీ నిధులు రూ.65 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు లోతుగెడ్డ తాతబాబు, కొయిలాపు సంజీవరావు, నివగాం ఎంపిటిసి ప్రతినిధి బిల్లింగి సంజీవరావు, పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ దాలినాయుడు, గేదెల దాలినాయుడు, గేదెల మన్మథరావు, ఎల్.పవన్ ఉన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నాటుసారాను నిర్మూలించి భవిష్యత్ తరాలకు బాటవేద్దామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు అన్నారు. మండలంలోని హడ్డివాడలో నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో, గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి నాటుసారా వల్ల కలిగే ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటు సారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం వ్యాపారాలను ప్రారంభించేందుకు సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలందరూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జి పాపారావును కమిటీ చైర్మన్‌గా, కార్యదర్శి మోహనరావు, వసంత, గంగయ్య, అరుణలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ కృష్ణారావు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

మాట్లాడుతున్న కరస్పాండెంట్ కింగ్

కవిటి: ఎస్‌విజె ఆంగ్ల పాఠశాల 28 వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందడి చేస్తూ తమలోని ప్రతిభను వేదికపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ధనుంజయ మజ్జి, కరస్పాండెంట్ కింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ తప్పనిసరని సూచించారు. ప్రాథమిక విద్య భవిష్యత్‌కు బాటలు వేస్తుందని కాబట్టి ప్రతివిద్యార్థీ దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బెందాలం జాన్సీ, హెచ్ఎం బి.జగ్గారావు, ఉపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి, సంతోష్, సిఆర్‌పి తులసీదాస్, సిహెచ్.జోష్ పాల్గొన్నారు.

పెరటి తోటలు, నర్సరీల పెంపకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నివాస ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అనువైన ప్రదేశాల గుర్తించి ఉద్యాన పంటలను, పెరటి మొక్కలను పెంచుకోవాలని హార్టీకల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ సూచించారు. రైతులకు పెరటి తోటల పెంపకం, నర్సరీల పెంపకంపై అవగహన కల్పించారు. శనివారం శ్రీకాకుళం మండలం ఎస్ఎస్వలస గ్రామంలో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థుల జాతీయ సేవాపథకం కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ గాయత్రితో పాటు ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కంచు వసంతరావు, ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ డా. ఉపేంద్రరావు, డా. చిన్నంనాయుడు, డా. అనిల్ కుమార్, డా. పురుషోత్తంరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు గోవిందరావు, స్పందన తదితరులు పాల్గొన్నారు.

గ్రామం చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పరామర్శిస్తున్న తిలక్

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని ఎత్తురాళ్లపాడు ఉప సర్పంచ్ తమ్మినేని కనకారావు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు సంపతరావు హేమసుందరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, బిసి సెల్ అధ్యక్షులు పేడాడ వెంకటరావు, సర్పంచ్ తలగాన గణపతి మాస్టారు, మండల వైసిపి యువజన అధ్యక్షులు మెండ జగన్, సీనియర్ కార్యకర్తలూ కూన దాలప్ప, నగరంపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

తాగునీరు బోరు ఏర్పాటు

కొత్తూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులు తాగునీరు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని ఇటీవల ఆస్పత్రి అభివృద్ధి సమావేశంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు బోరు తీస్తానని హామీనిచ్చారు. ఈ హామీ మేరకు శనివారం తాగునీరు బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల కృష్ణవేణి, టిడిపి నాయకులు మాతల గాంధీ, చోడవరపు రాము, ప్రదీప్, ముగితి కృష్ణారావు, పాలవలస గోవిందరావు పాల్గొన్నారు.

ఘనంగా 'జ్ఞానజ్యోతి' వార్షికోత్సవం

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి స్కూల్‌లో శనివారం 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వార్షికోత్సవంలో పాల్గొని విద్యార్థుల భావి భవిష్యత్‌లపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి పాల్గొన్నారు.

యాత్ర ప్రారంభిస్తున్న విప్ అశోక్

వైభవంగా వింధ్యగిరి యాత్ర

కవిటి: మండలంలోని వింధ్యగిరి కొరారి చండీమాత యాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయ దీపాలతో పాటు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దీపం వెలిగించి యాత్ర ప్రారంభించారు. ఆంధ్రా ఒడిశాతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఒడిశా వాసులూ అధిక సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొని చండీమాతకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.